# "ఇంకా తెల్లవార లేదు!"

తాడిగిరి పోతరాజు

ఇంకా తెల్లవారలేదు.

ముసి ముసి చీకట్లు. తూరుపు ఇంకా ఎర్రబారలేదు ఉన్నతంగా ఆకాశంలోకి చొచ్చుకు పోయిన తాళ్ళతోపు. దాని అవల వెలుగు రేఖలు స్పష్టంగా విచ్చుకుంటున్నాయి

పల్లెలోని రైతులు ఎప్పుడో లేచారు. గిలకల చప్పుడు. రైతులు నీళ్ళు తెచ్చుకుంటున్నారు. మగవాళ్ళు గోలాల్లో నీళ్ళు పోస్తున్నారు. ఆడ వాళ్ళు ఊడ్చి కళ్ళాపి చల్లుతున్నారు.

పేరమ్మ గారు అలుకు చల్లడం అయి పోయింది.

మిగిలిన పేడనీళ్ళు- చిక్కటివి. పందిరి మూలలోని సన్నజాజి పాదుకు పోసి కాళ్ళతో చదును చేసింది.

"కోళ్ళు పాడుగాను.... ఒకటే చెలగటం.... కెలికిపారేస్తన్నయి. చేతులు పొయ్యేట్టు అలుకు చల్లడం నా పని.... చెలిగి పారెయ్యడం వాటి పని...." గొణుక్కుంటూ చదును చేసి, చేతిలో ఉన్న ఈతాకుల చీపురు అక్కడ పారేసింది.

మంచి నీళ్ళతో కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడుక్కుంది. బొడ్డుపై కెక్కిన చీర కుచ్చిళ్ళు దించుకుంది. కొబ్బరి ఈనెల చీపురందు కొని కాళ్ళు విదిలించుకుంటూ లోనికెళ్ళింది. ఇంట్లో ఇంకా చీకటిగా ఉంది.

ఆమె కాళ్ళ అడుగుల సవ్వడి- దానికి ప్రతిధ్వనిగా 'లట లట' మన్న చప్పుడు

"ఆర్నీ ఎలుకలు మాడ్నంగాను.... లట లట మని ఒకటే ఉరకటం....అయ్. ఒకటా.. రెండా.. గొప్పరెమందలేననుకో.. రాత్రిళ్ళు కంటి మీద కునుకు పడనియ్యకుండా ఒకటే కిచ కిచ.... బస్తాలన్నీ బొక్కలే... ఒక్క గోతం అయిదు రూపాయలు పోసి కొంటే ... అన్నీ కన్నాలే... అన్నీ బొక్కలే.... వీటికి గత్తర రాను. ఒక్క గోతం కాకపోతే ఒక్కటయినా మంచి గుంచినయ్యా...." అంటూ మెట్టుపై పరుగెత్తుతూన్న ఎలుకలను చీపురుతో రెండు చరిచింది. అవి తప్పించుకొని గోడల పైకి పొయ్యాయి.

మెట్టు కొనపై చేతితో తడిమి చూసింది.

"ఈ అగ్గిపెట్టె ఎక్కడ సచ్చిందో! ఏమో!.... దీపం ఎలిగించుకుంటే తప్ప ఏదీ సక్కంగ కనబడదు.... ఇగ్గో నిన్నే.. రాత్రి ఇక్కడ పెట్టిన అగ్గి పెట్టె తీశావా? ....నువ్వొకడివి నా ప్రాణానికి.... పెట్టిన వస్తువు పెట్టిన చోట ఉంచవ్.... చుట్ట కాల్చుకున్న వాడివి. మళీ ఇక్కడే పెట్టాలని తెలవదా?...." పెద్దగా గొంతు పెట్టుకొని పందిట్లోకి చూస్తూ భర్తనుద్దేశించి అంది.

"అగ్గి పెట్టేనా?.... ఇగ్గో.... రాత్రి. ఆదమరిచి జేబులో ఏసుకున్నా ఎడ్లపెగ్గం చేతికి వలయాకారంగా చుట్టుకుంటూన్న పెద్దిరాజు ఆమెకి అగ్గి పెట్టె అందించాడు. సర్రున అగ్గిపుల్ల గీచి మెట్టు చివరనున్న కోడిగుడ్డు దీపం వెలిగించింది.

పసుపు పచ్చని కాంతి ఆ కాంతిలో ఆమె ముఖం మరింత పసుపు వర్ణంతో మెరవ సాగింది. పండిన ఆవిడ జీవిత అనుభవాలు ముగ్గు బుట్టలాటి ఆమె తలలో ప్రకాశిస్తున్నాయి. ఆరు పదులు దాటినా ఆమె మాటల్లో వాడీ వేడీ తగ్గలేదు.

చురుకైన ఆమె కళ్ళను తిప్పి ఇల్లంతా కలియ జూసింది.

మెట్టు చివరన పెద్ద గుమ్మి పేడతో అలకబడి సీలు వేసి ఉంది- మెట్టుపై బస్తాల్లో ధాన్యం మెట్టు విరిగి పోయ్యేలా ఉన్నాయి. వడ్లబస్తాలు, కందులు, పెసలు.

దీపం మెట్టు క్రిందకు దించి పరీక్షగా చూస్తూ పెద్ద పెట్టున గొంతు చించుకో సాగింది

"అయ్యో.... అయ్యో!.... ఇట్టా రోజూ చిన్ని వడ్లు నాశనమయితే మనకు మిగిలేదేముంది. నా బొంద.... ఇగ్గో.... నిన్నే.... ఇంటన్నావా?.... తలకాయవంచి మెట్టు కిందకు సూడు.... ఆ కుప్పలు సూడు... రెండు కుంచాలకు తక్కువ ఉండవ్....ఆ వడ్లు....రోజూ అట్ట కొరికి పారేత్తే మనకేం మిగులుతయి చెప్పు... అమ్మవయ్యాంటే అమ్మిసావవు....రేటు లేదంటావ్. ఈ దేశంలో ఎన్నడుంటదంటావ్ రేటు. 'అమ్మబోతే అడివి. కొనబోతే కొరివి' అని ఊకినే అనలేదు రైతుల దగ్గరున్న పంటంతా ఆ అమ్మికొడుకుల గోదాముల్లో సేరితేనే గానీ, రేట్లు పెంచరు అయినా అప్పటికీ ఇప్పటికీ పదిరూపాయల దరలేసిందంటగా? కల్లాలప్పుడు నూటయిదయితే ఇప్పుడు పల్లాకు (క్వింటల్) కు నూట పదయినయ్యంట. నిన్నంగడికి పొయ్యొచ్చిన సీతయ్య అంటన్నాడు. నా మాటిని అమ్ముకో.... ఈ ఎలుకలు రోజూ ఇంత గనక నాశనం చేత్తే నువ్వు అమ్ముకొనే నాటికి లాబం గూబలోకి వత్తది. బంగారం లాంటి మసూరా వడ్లు.... ఎలుకల పాలెందుకు సేత్తావ్. అమ్మ అమ్మ .. రోజూ మెట్టు కింద వడ్లు పోగుజేసి చిన్న గాదెలో పొయ్యాలంటే నారెక్కలిరిగి పోతన్నయి. ఎలుకలు పాడుగాను.. తెగతిని ఇంతింత దొడ్డు పందికొక్కులయి పోయినయి.... అయ్యో నామతి మరుపు మండా!..కోళ్ళను ఇడిసి పెట్టకుండానే లోనికొచ్చాను. కొక్కొరోకో-అని అవి ఒకటేగోల...." అంటూ తనలో తాను మాట్లాడు కుంటూ తిరిగి పందిట్లోకి వెళ్ళింది.

ఉదయ కాంతులు పందిరి నిండా పరుచుకోసాగాయి.

కోళ్ళ గంపలపై పెట్టిన రాళ్ళను విసురుగ్గా తోసిపారేసింది. ఒక్కొక్క గంపనే లేవసాగింది.

మొదటి గంప క్రింద ముద్దుగా ఉన్న రోజుల కోడి పిల్లలు- వారం పదిరోజుల వయస్సు. మృదువైన బొచ్చుతో మెత్తగా



సున్నితంగా ఉన్నాయి. ఎర్రని తెల్లని కోడిపిల్లలు. తిరుగుతూన్న పువ్వుల్లా ఉన్నాయి. గంప ఎత్తగానే అవి తమచిన్న చిన్న రెక్కలు విప్పుకొని గాలిలోకి ఒకసారి పరుగెత్తసాగాయి స్వేచ్ఛ స్వేచ్ఛ. ఎంతో హాయిని కలిగిస్తుంది. ఒక డజను కోడిపిల్లలు తల్లి సౌంజ్ఞలు చేస్తూంటే ఎగురుకుంటూ తల్లి కోడిని అనుసరిస్తూ వెళ్ళిపొయ్యాయి.

రెండవ గంప నుండి అరకోళ్ళు బయటికొచ్చాయి. వాటిల్లో కొన్ని పుంజు పిల్లలు. వాటికి తలపై ఎర్రగా కుచ్చులు మొలుస్తున్నాయి. వాటి తోకలపై ఈకలు అర్ధవృత్తాకారంగా వంగుతున్నాయి వాటికి కూత ఇంకా సరిగా రాకపోయినా 'కెక్కే-కే' అంటూ కూత సాధన చేస్తున్నాయి. రంగు రంగు ఈకలతో ఆకర్షణీయంగా ఉన్నాయి.

మూడవ గంప నుండి గుడ్లుపెట్టే కోడిపెట్టలు, బలంగా, ఆరోగ్యంగా ఉన్నాయి. వాటి మధ్యలో తెల్లని పుంజు- కాళ్ళు పొడుగ్గా ఉన్నాయి. మెడపై ఎర్రని కుచ్చు. కంఠం క్రింద గడ్డంలా ఉన్న తెత్తులు. అది గంప ఎత్తగానే తతిమ్మా కోడిపెట్టల్లా పరుగెత్తలేదు. మగటీవిని ఒలక పోస్తూ హుందాగా నిలబడ్డది. రాతి స్తంభం ప్రక్కనే చేరి 'కొక్కొరోకో' అని పెద్దగా నినాదమిచ్చింది. ఆ తరువాత ఓ అందమైన కోడిని చూసి దాని వెంట పరుగెత్తింది.


"పొయ్యి రాజేత్తావా? సల్లజేత్తావా? ముందు నువ్వు సల్లజేత్తానంటే జర్రసేపు ఆగి ఒక్క బుక్క సల్ల తాగిపోదామనుకుంటున్నా. నువ్వు సద్ది వంపించేటప్పటికి ఏ జామవతదో ఏమో? నిన్నటి నుంచి ఉత్తరపు గాలి సాగింది. రెండు దారల పొద్దెక్కే సరికి ఆకలిమండిపోతంది...." భర్త అన్నాడు.

"ఇప్పుడు సల్ల జెయ్యటం కుదరదు. పొయ్యిలో బూడిద ఎత్తిపోయ్యాలి. ఇల్లంతా ఊడ్చి కసువు ఎత్తి పారబొసి నాంతగానీ కవ్వం బెట్టను.... పాచిల్లు ఊడ్చుకోకుండానే కవ్వం పెట్టమంటావా? ఏందీ సెప్పు. అవన్నీ చేసుకునేటప్పటికీ బారెడు పొద్దెక్కుతది. అప్పుడు దాకా నా కెదురుగ్గా కూసుంటావా ఎడ్లమెడలపై నాగళ్ళెత్తి"

"అది కాదే.... సల్లజేత్తావా ఇప్పుడని అడిగితే ఇంత రావాయణం సదవబడితివేమే". అంటూ పగ్గం ముల్లుకర్ర చేత్తో పట్టుకుని ఎడ్లవయిపు నడవసాగాడు.

"అది సరేగానీ.... అక్కడాగు. మరి ఈ ఎలుకల సంగతేంది? ఈటిపోరు పడలేకపోతున్నా రోజూ ఒక రూపాయో రెండో ఇచ్చిపో. వరంగల్లు పోతాడంట చిన్నప్పరెడ్డి కొడుకు. రాంగనే రెండు పొట్లాలు ఎలికల మందు తెప్పిస్తా. నీకేం పాపం తగలదులే. ఆ పాపమేదో నాకే తగులుద్ది. నేనే అన్నంలో ఆ మందు కలిపి గుమ్మికింద పారేత్తా. తెల్లారేసరికి సచ్చి నీలక్కపోతాయి. అటయితేనేగానీ వీటి పీడ మనకు వదలదు. ఒకరూపాయి యిచ్చిపో."

"నీకు ఎన్నిసాల్లు చెప్పానే వాటిని సంపకూడదని. వాటిది కూడా మనలాంటి ప్రాణమేనని. ఈ బూమ్మీద మనుషులనే కాదు, భగవంతుడు ఎర్రచీమల కాడ్నుంచి ఏనుగుదాకా ఎన్నో జీవులను పుట్టించిండు వాటి బతుకు వాటిది మన రెక్కల కట్టం పూర్తిగా మనకు ఏనాడూ దక్కదు.



ఇత్తనం పెట్టినప్పటినుంచి కోతకోసే వరకూ పురుగులు, పిట్టలు, పశువులు అన్ని మనల్ని నమ్ముకొని బతికేటివే. పట్నంలోని సావుకార్లు, సర్కారోళ్ళు అందరూ మనల్ని దోసుకుని బతికే టోళ్ళే గందా! ఇక ఈ ఎలికలంటావా? అవెంత- అటి ప్రాణమెంత. కాకపోతే ఒక చారెడు ఒడ్లు.... కాకపోతే ఒక దోసెడు.... అంతేగానీ గుమ్మికి గుమ్మే తినవు గదా?"

"సరే.... వడ్లంటే మన పొలంలో పండినయి. మన రెక్కల కష్టం. పోనియ్యిలే అనుకుందాం. మరి గోనె సంచుల సంగతేంది? అవి మన తుమ్మ చెట్లకు కాసినయ్యా చెప్పు.... రెండొందలు పెట్టి యాభై సంచులు తెస్తివి. వాటిల్లో నీకు ఒక్కటయినా ఇయ్యాల మనకు అక్కెర కొచ్చేది వుందాని? వాటిని దేవుడు పుట్టించిండు కాబట్టి వాటిని మనం సంప కూడదు. బాగానే వుంది. మరి వాటికి గింజా గిడుసు కూడా ఆ దేవుడే సూసు కోవాలి కదా మరి. మంది గుమ్ములమీద బతకమంటే ఆ దేవుడునైనా ఏం న్యాయం అనుకని ఒక రూపాయిచ్చి పో. మందు తెప్పిస్తా."

ప్రశాంతంగా ఆమె మాటలు ఆలకిస్తున్న పెద్దిరాజు నొసటిపై చెయ్యి అడ్డం పెట్టుకుని తూర్పువైపు చూశాడు. పొద్దు రెండు బారలెక్కింది.

"ఇగ్గో.... నీకాపల్సింది. ఎలుకలు బస్తాలు కొట్టకుండా ఉండడమే గానీ.... ఎలుకలు సావటం కాదుగా?" ప్రశ్నించాడు.

"అవు.... అంతే మరి."

"అయితే ఒక పని చేద్దాం మరి. ఆ గొల్ల రాములమ్మ ఇంట్లో ఒక పిల్లి కూన వుందంట. కూనంటే మరి కూనగాదు. ఒక మోస్తారు పెద్దదే. ఎలుకల్ని తరిమి కొట్టగలదు. మన మనిషిని పంపించి తెప్పిస్తా దాన్ని. ఇక రేపట్నుంచి మనకు ఈ తలనొప్పి ఉండదు" అంటూ పెద్దిరాజు ఎడ్లను అదిలించి ముందుకు సాగిపోయ్యాడు.

* * *

అనుకున్నట్లుగనే పిల్లి వచ్చింది.

పిల్లిరాక వలన పెద్దిరాజుగారింట్లో ఎలుకల బెడద వారించబడలేదు కాని కొంతమేరకు తగ్గిపోయింది. పట్టపగలే ఈ బస్తానుండి ఆ బస్తా పైకి దూకడం, వేళాపాళా లేకుండ విహరించడం, విన్యాసాలు చెయ్యటం, పైన వాసాల్లో ఉండి వెక్కిరించడం, మీసాలు కదిలిస్తూ కవ్వించడం, జంటలు జంటలుగా క్రిందబడి పైకి ఎగబ్రాకటం మొదలైన చర్యలు తగ్గిపోయాయి. దీనంతటికీ కారణం గోనె సంచిలో మూతికట్టి తెచ్చిన పిల్లి. పెద్దపులి చారల పిల్లి.

కానీ ఆ పిల్లికి వేటాడి పొట్టపోసికోవాల్సిన పరిస్థితులు లేవు ఆ ఇంట్లో.

పాడీపంటా ఉన్న ఇల్లు కాబట్టి దానికి సుఖమైన రోజులు ప్రారంభమైనాయి.

ఉదయం ఎనిమిందిటికి ఒక చిన్న గిన్నెడు చిక్కటి పాలు.

వెనుక కాళ్ళమీద కూర్చొని, తోక బారుగా చాపుకొని, కళ్ళు మూసుకొని ఆ పాలన్నిటిని స్వాహా చెయ్యటం, ఆ తరువాత ఆ గిన్నెను శుభ్రంగా నాకటం- మెత్తటి తన ముందుపాదంతో మూతీ, మీసాలు తుడుచుకోవటం "మ్యావ్-మ్యావ్" అని కృతజ్ఞతలు చెప్పి మెట్టుపై బస్తాలపై గుండ్రంగా ముడుచుకొని పడుకోవడం దాని ఉదయ కార్యక్రమం.

ఒకవేళ ఏ కారణంవల్లనైనా ఆలస్యం అయితే చంటి పిల్లాడిలా పేరమ్మగారి కాళ్ళకు అడ్డంపడుతూ ఆమె వెనుక తిరుగాడేది. పాలు కాచి, ఆరబెట్టి దాని గిన్నెలో పోసే వరకూ ఒకటే 'మ్యావ్ మ్యావ్'.

మళ్ళీ పన్నెండు గంటలకు దాని పునర్దర్శనం.

మధ్యాహ్న భోజనానికి పెద్దిరాజుగారు కంచం ముందు కూర్చున్నప్పుడు అది మెల్లగా బస్తాలు దిగి, ఒళ్ళు సాగదీసుకొని ఆయన కెదురుగా కూర్చునేది.

పెరుగుతో కలిపిన అన్నం, లేకపోతే చిక్కటి మజ్జిగతో కలిపిన అన్నం-దాని కోసం ప్రత్యేకించిన సత్తు పళ్ళెంలో వేసే వాడు. సుష్టుగా తిని మళ్ళీ వెళ్ళి బస్తాలమీదనో, వరుపుమీదనో పడుకొనేది. మళ్ళీ రాత్రివేళ భోజనానికి సిద్ధం.

రాత్రీ-పగలు తారతమ్యం లేకుండ ఒకటే నిద్ర.

గుర్రు- గుర్రుమని ఒకటే నిద్ర- గురక.

పనిపాట చెయ్యకుండ, ఫస్టుతారీఖు నాటికి ఫెళఫెళమనే కొత్తనోట్లు కళ్ళ చూసే ప్రభుత్వోద్యోగిలాదిగుల్లేని జీవితం దానిది. శాంతిభద్రతలు కాపాడటానికి నియమితుడైన పోలీసు సబిన్‌స్పెక్టర్ లాటి అటూ ఇటూ తిప్పి, జీపు ఎక్కి తుర్రుమన్నట్లుగా-అప్పుడప్పుడు 'మ్యావ్ మ్యావ్'మని అరిచి బస్తాలపై కెక్కేది పగటి నిద్రకొరకు.

"ఏనాడో పెట్టి పుట్టింది.... ఈ పిల్లికి ఎంత సుకం" అనే వాళ్ళు ఇరుగు పొరుగు.

"మనవలు- మనవరాళ్ళు పట్నంలో నదువులకెల్లి పొయ్యారు. ఇక మనవడయినా, మనవరాలయినా పేరమ్మక్కాయికి ఈ పిల్లే. ఎంత అల్లారు ముద్దుగా సాకుతుందో ఈ పిల్లిని" అని అభినందించేవాళ్ళు వరసయిన చెల్లాయిలు.

దానికి ఆవిడ 'కస్సు'మని లేచేది.

"ఛాత్తెరీ... పిల్లి పాడుగాను. దీనికి బాగా ఒళ్ళు బలిసింది. ఎక్కడా తలం

లేనట్టు గుమ్మాల్లో స_స్తది. ముక్కులు పగిలి పోతన్నయనుకో పొట్టబగలతినటం గాదెలో సావటం. పేడ పిడకల్లా ఎండి పోతే వాటిని ఏరి బయటకు విసిరెయ్య లేక నా చేతులు పోతన్నాయి. ఈ ఎత్తి పోయడం నాతో కాదు. ఆ పిల్లిని ఎల్ల గొడదామంటే మీ బావ నా మాట ఇంటేనా?" అంటూ ఆవిడ అసంతృప్తిని వ్యక్తపరిచేది. ఈ కారణంగా ఆమె కోపం పట్టలేక తరచుగా పిల్లిమీద చీపురు తిరగేసేది.

ఈ ఒక్క లోపం మినహా ఇస్తే పిల్లిలో ఏరకమైన ఒడీ ఒంకాలేవు. అది పాలూ, మజ్జిగ, నెయ్యీ మొదలైన సాత్విక ఆహారం తిని నూటికి నూరుపాళ్ళు శాఖాహారిగా మారి పోయింది. స్వయంగా వేటాడి, ఒక ఎలుకనుగానీ, ఒక తొండను గానీ చంపి, తిన్న పాపానికి ఒడి గట్టలేదు. ఈ అసాధారణ సాధు ప్రవర్తన వలన యాజమాని మన్ననలు పొందింది. అహింసావాదిగా నిష్కళంకమైన జీవితం గడప సాగింది.

* * *

ఈ శాంతియుత సహజీవన వాతావరణంలో కాలం ఒకచిన్న మార్పు తెచ్చింది.

ఒక రోజు ఊరి నడిబొడ్డు వద్ద జనం పోగయ్యారు. ఒక సైకిల్‌పై పెద్ద జాజి చెక్క పెట్టె పెట్టుకొని నిలబడ్డాడు. ఆ పెట్టె నిండా తెల్లని కోడి పిల్లలు. అరలుఅరలుగా ఉన్న ఆ పెట్టెలో సీమ కోడి పిల్లలు. లేక పసుపు పచ్చ కాంతులతో ఒకటి రెండు రోజుల వయస్సున్న కోడి పిల్లలు.

"కోడి పిల్లలు-కోడి పిల్లలూ....చౌక-చౌక—" అని కేకలు పెడ్తున్నాడు.

"ఫారం కోడిపిల్లలు...."

"అంటే కరెంటుకు బుట్టిన పిల్లలు..."

"అవ్వలేదు....అయ్యలేదు...చిత్రం... ఇంకా కొన్నాళ్ళు పోతే మనుషులనుకూడా బుట్టితారు...." సందేహాలూ, నివృత్తులూ, నవ్వులూ, వినవస్తున్నాయి.

"ఎంత కోడిపిల్ల?...."

"అర్థ రూపాయి...."

"కోడి గుడ్డు నలభై పైసలు. కోడి పిల్ల అర్థరూపాయంటే అగ్గువ. ఎంత సౌక ఎంతసౌక—మనం కోడిపిల్లలను చేయించాలంటే పొదుగుడు కోడిని సూడాలి దాని కొాక కుంపటి సూడాలి.. దాన్నిండా ఇసుక పోసి కూర్చోబెడితే. ఇరవై రోజులకుగానీ అది కుంపటి దిగదు....అందులో కొన్ని సీగుడ్లయి పోతాయి.....గుడ్లన్నీ పిల్లలుకావు గదా?...." వ్యాఖ్యానాలు జరుగుతున్నాయి అక్కడ.

"ఇగ్గో విన్నావా?....ఆ కోడి పిల్లల సంగతి ... అర్థరూపాయంట అందరూతలా పది కొంటన్నారు మరి మనకు కూడా ఒకపదికొంటా....ఐదురూపాయలివ్వు .." పేరమ్మగారడిగింది.

"అయిదు రూపాయలిత్తాగానీ....వాటిని సాకటం ఎట్టాగే ... తల్లిలేని పిల్లలు గదా? రేపు గెద్ద వచ్చినా, కుక్క బట్టినా వాటికి దిక్కెవల్లు. తల్లి కోడి గనక ఉంటే వాటిని కాపాడు కొంటాది....మరి తల్లి లేకుండా వీటిని బతికించటం ఎట్టాగాని ఆలోసిత్తన్నా...." అన్నాడు.

"అవే బతుకుతయి తియ్యి .... ఇన్ని గింజలు పొద్దుమాపు వేసి వాటిని అటటు తిరగనిస్తే సరి. మద్దెనేల, రేత్రిపూట, గంపకింద ఎస్తేసరి నేనెందుకు సెబుతున్నానంటే మన అరకోడి పిల్లలు పెద్దగయినయి. వాటిని అమ్మకుంటే నూటయాభై రూపాయలొస్తాయి. నారు మడికి ఎయ్యటానికియూరియాబస్తాకుఅక్కెరకొస్తాయి. మళ్ళీ మనం కోడిపిల్లలు చేయించేసరికి ఇంకా రెండునెల్లయినాబడతాది. అంతలోకే ఈ ఫారం కోడిపిల్లలు అరకోళ్ళవతయి. ఇప్పుడు పది కోడి పిల్లలు. ఎంత సెడి అమ్ముకున్నా, నూరురూపాయలకు తగ్గవు. నా మాట ఇను" అంది.

భార్య మాటల్లోని ఆర్థిక అంచనాలు, తన అవసరాలు బేరీజు వేసికొని లోనికి వెళ్ళి అయిదురూపాయిలు తెచ్చాడు. పది కోడిపిల్లలు పందిట్లో దిగినయి.

కొత్త సంబరంలో పేరమ్మగారు ఒక వారంవాటి ఆలనాపాలనా బాగానేచూచింది. గద్దబారి పడకుండా కుక్కబారి పడకుండా కాపాడుకున్నది అయితేఆమెకుఇదొక్కటే పనికాదుకదా! "యాడికి సావబోతయ్ తియి ఈటికి ఎదురుగ్గా కూర్చుంటే కూడెట్టా వస్తది" అనుకుంటూ, ఒక కన్ను వాటిపై ఉంచి, చిన్న పనీ, పెద్ద పనీ చూసుకో సాగింది. అయితే పనుల్లో నిమగ్నమై పోయి ఆ కన్ను కూడా వాటిపై తీసి వేసింది.

సాయంత్రం కోళ్ళను కమ్మే వేళ అయింది.

నాటుకోళ్ళు అన్నీ వచ్చాయి. ఇక పోతే తల్లిలేని ఫారం కోడిపిల్లలు పదికి బదులు ఐదు మాత్రమే వచ్చాయి ఆమె ఇంటి చుట్టూ తిరిగి చూసింది. పెరట్లో గాలించింది. కోడిపిల్లలు అజా అయిపూ లేవు. రాత్రి భోజనాలప్పుడు భర్తతో చెప్పింది.

"అవి తల్లిలేని పిల్లలు.... సాకలేమే అంటే ఇన్నావా? ఎటు పొయినయ్యో ఏమో? పోనివ్వు ఇక. అయిదు రూపాయల్లో రెండున్నర రూపాయలు గంగలో కలిసిపోయె" అన్నాడు భర్త చిరుకోపం ప్రదర్శిస్తూ.

"గెద్ద గిట్టా వచ్చిందా?" మళ్ళీ అది

## కృష్ణునికై తృష్ణ

గోప దేవా,
నీ సన్నిధి, మా పెన్నిధి
మేమెంత నీ చెంత,
శుభచరితా?

శ్రీ రమణా
నీ చరణాలే
మాకు శరణం

క్రాంతిలో శాంతివి
భ్రాంతిలో కాంతివి
శ్రీకాంతా,

పురుషోత్తమా,
మా తనువే ఒక తపస్సు,
నీ వినుతి మాకు ఉషస్సు,
నీ తేజస్సే మా మనస్సు,

నీరజ వదనా
నిరంజనా
మునిజన రంజనా
శతకోటి
నీరాజనాలు.

—డాక్టర్ ఎమ్.ఎ.పద్మనాభరావు

డాడు.

"లేదు."

"కుక్కలు పట్టినయ్యా!" అన్నం తిని చెయ్యి తుడుచుకుంటూ అడిగాడు.

"కుక్కలు ఒక్కటీ కూడా రాలేదు."

"మరి గెద్దరాక, కుక్కరాక మన ఇల్లు మింగిందా?"

"ఇల్లెందుకు మింగుద్ది? పిల్లి మింగుద్ది. నాకు దానిమీదే అనుమానం."

"మన పిల్లినా? అది మన ఇంట్లో ఉండబట్టి ఇన్ని నెలలాయె. దాని గుణం మనకు తెలవదా? ఎన్నడయినా కోడిపిల్లల కోసం పొంచులేసిందా? ఒక ముద్దబెడితే తిని బస్తాలపై పడుకొంటది.... సూడకుండ పెట్టకుండ దాన్ని ఆడిపోసుకోవడం మెందుకు. పాపం నోరువాయిలేనిప్రాణం అది" వేదాంతిలా మాట్లాడాడు.

"నాకు అనుమానం ఎందుకొస్తం దంటే ఈ రోజు మనం రెండుజాములకు అన్నం తిన్నప్పుడు అది బస్తాలు దిగి రాలేదు. మామూలుగయితే పెరుగుతవేలా మీద మూత తియ్యంగనే "మ్యావ్-మ్యావ్"మంటూ ఊపిరాడనిచ్చేది కాదు"

"అది అన్నానికి రాకపోతే ఇక కోడి పిల్లలు తిన్నట్టులెక్కా! మనకు పాపం తగులుద్ది అసుమంటి మాటలంటే. ఇయ్యాల దానికి అన్నం పెయింవటం లేదేమో" అని మంచం ఎక్కాడు.

ఆ రెండోరోజు ఆమె అన్నికోళ్ళనూ విప్పింది. పారం కోడిపిల్లలు తప్ప. పని ముగించుకున్నాక తొమ్మిదింటికి విడిచి పెట్టింది. ఈ రోజు వాటిపైన ఒక కన్ను కాదు, రెండు కళ్ళూ వేసి ఉంది. వాటిపై నిఘావేసి చూస్తూ ఎప్పటికప్పుడు లెక్కించుకుంటూ మధ్యాహ్నం దాకా చూసింది. కానీ మధ్యాహ్నం ఎండకు కళ్ళు మూతలు పడుతూంటే పందిట్లోకి ఒక కుక్కిమంచం లాక్కుని, ముఖం మీదకు పమిటలాక్కుని ఒక క్షణం ఒరిగింది.

ఆ విధంగా కన్ను మూసిందో లేదో-కీచు.కీచు మంటూ 'కీకీ' అంటూ ఆర్తనాదం వినిపించింది. రెప్పలు తెరచి కళ్ళు విప్పార్చుకొని చూసింది. పెద్ద కోళ్ళన్నీ భయంతో, కలవరంతో 'కొక్కొక్కో' అని అరుస్తున్నాయి. గోల గోలగా వుంది. నిస్సహాయంగా నిలబడిన పుంజు పెద్ద గొంతుతో విరామం లేకుండ అరుస్తోంది ఈతచెట్ల వంక చూస్తూ.

ఆమె ఈతచెట్ల బోదెలవంకచూసింది. ఆ చెట్లచాటున పిల్లి పిల్లి నోటిలో కోడిపిల్ల. మెడ కాళ్ళూ వేలాడుతున్నాయి నడుం కరచి పట్టుకొని పరుగెత్తుతోంది.

పేరమ్మగారు ఒక్క ఉదుటునలేచింది. 'అదీ—అదీ—' అనుకుంటూ

"నీ పిల్లి నాశనంగాను... అయ్యయ్యో కోడి పిల్ల నేసుకొని పోతుందిరో" అని అరచుకుంటూ ఈత బరిగ ఒకటి అందుకొని ఈత చెట్లకాడికి పరిగెత్తి పిల్లిని నాల్గు చరిచింది. పిల్లి ఆ కోడిపిల్లను అక్కడ పారేసి భయంతో, తోకను జల్లి తోకలా విప్పుకొని ఇంటిలోకితుర్రుమంది.

ఆమె కోడిపిల్లను పైకెత్తి చూసింది. కోడిపిల్ల ప్రాణాలు ఎప్పుడో గాలిలో కలిసి పొయ్యాయి. దాని రెక్కలు క్రింద పిల్లి కరిచిన కోరలు. చుక్కలు. చుక్కలుగా రక్తం. అచుట్టూ పరికించి చూసింది. తెల్లని దూదిలాంటి కోడిబూరు గాలికి ఎగురుతోంది.

"దీని పొట్టబగలా! అయిదు రూపాయల కోడిపిల్లల్ని దాని బొందమీద తగలేస్తిమే.... పిల్లిపాడుగాను. శనిలాదాపురిం చిందంటూ" ఆ రోజంతా తిడ్తూనేవుంది. సాయంత్రం భర్త ఇంటి ముందుకు వచ్చీ రావటంతోనే మొదలేసింది.


"చూశావా!ఆ పిల్లి...ముదనష్టపుముండ ఆ మిగిలిన అయిదు కోడిపిల్లలనూ అరగించింది ఇయ్యాల. నేను పెబితేఇన్నావా? పిల్లి తిని ఉండొచ్చులే అంటే నువ్వు నన్ను గదమాయించి పారేస్తివి. అది సత్తెకాలపు పిల్లి. దానికి అసుమంటి బుద్దులు లేవంటివి. ఇయ్యాల సూడు ఎంత పని చేసిందో. నేను అట్ల కన్ను మూశానో లేదో! ఒకటి కాదు.రెండుకాదు. ఐదింటిని కన్నుమూసి కన్ను తెరిచేలోకే చప్పరించి పారేసింది.

"నీకు నిజంగా బుద్ధిలేదే! నిన్న అయిదు పోయినయ్యి గదా, ఇయ్యాల నీ జాగర్తేదీ అంట. అయిదు పిల్లలు తినే దాకా అంత మొద్దునిద్దర పోతే అది తినకేం చేస్తది చెప్పు. ఇక పోనివ్వు .. నీ యవ్వ ఇదొక జాతర. వాడికి ఏ జన్మలోనో అయిదు రూపాయలు బాకీ-అని ఊరుకో.... వద్దమ్మా! అవి తల్లిలేని కోడి పిల్లలే, వాటిని బతికించటం కష్టమే!.... అంటే ఇన్నావ్ కాదు. ఇప్పుడు నోరూ వాయిలేని పిల్లిని ఆడిపోసుకుంటే చచ్చిన పిల్లలు తిరిగొస్తాయ్యా.... అలవాటులేని పిల్లికి కోడి మాంసం అలవాటు చేస్తివి..." ఆయాసంగా శ్వాస తీసుకోసాగాడు.

"కోడి పిల్లలను కాదం నా తప్పే... నిద్రబోవటం నా తప్పే.... అన్నీ నా తప్పులీ.. మరి పిల్లిదేం తప్పులేదంటావా? దానికేం తక్కువైందీ అంట? పెరుగు తక్కువైందా? పల్ల తక్కువైందా?.... ఏం తక్కువై కోడి పిల్లలను తిన్నట్టు?... నాకా సంగతి చెప్పు ముందు.." ఆమె చేతులు తిప్పుకుంటూ ప్లీడర్‌లా మాట్లాడ సాగింది.

ఆలోచన శూన్యమైన కళ్ళతో మౌనంగా ఆమెకేసి చూడసాగాడు.

అతని మౌనం ఆమెను మరీ రెచ్చ



గొట్టింది.

"....దాని జాతి లచ్చనం అది ఎరి కయిందా? పిల్లి-పిల్లే.. నువ్వు రోజుకు మూడు సార్లు పాలు బొయ్య.... వప్పు నెయ్యా కలిపి పరమాన్నం బెట్టు... పిల్లి కోళ్ళను బట్టడం మానుకోదు... అందు వల్ల ఆ పిల్లిని ఇయ్యాలే ఎరకలోడ్ని పిలిసి పట్టుకెళ్ళమని సెప్పు పీడాపోతుంది" పరిష్కారం సూచించింది.

"పిల్లిని సంపటం మహా పాపమంట. ఎనకటికి శ్రీకిష్ణదేవరాయలు పిల్లిని సంపి ఆ పాతం పోగొట్టుకోటానికి, బాపనోళ్ళను పిలిసి, పూజలు సేయించి మంత్రాలు సది వించి ఒక్కొక్క బాపనాయనకు బంగారు పిల్లినిత్తేగానీ ఆ పాపం పోలేదంట....


అంత పాపానికి మనం ఎందుకొడి గట్టాలి. ఎల్లగొడితే పోతది. ఎరుకలోడ్ని పిలిసి పట్టించటం ఎందుకులే..."

"ఇదిగో ఆసుమంటి సీరంగ నీతులు నమ్మి సెడిపోవద్దంట. అయ్యగారికి కోళ్ళంటే ఈ ఊసే ఎత్తేవాడు కాదు. ఆడికి కోళ్ళా, కొంగలూ లేవు గాబట్టే చాత్రులు అది పాపం—ఇది పాపమని శాత్రాలు సెబుతాడు. నాకు కడుపు తరుక్కు పోతంది. ఆ కోడి పిల్లలు నా కళ్ళలో మెదుల్తున్నాయి. బంగారం లాంటి కోడిపిల్లలు.... ఈ పిల్లిని ఎరుకలోడికి పట్టిస్తే తప్ప నాకు నిద్దర బట్టదు...." అంటూ కొట్టం ఊడ్చే పొలికట్టె పట్టు కొని ఇంట్లోకి విసవిసా నడిచింది.

చల్లచేసే మొకరం వద్ద పిల్లి పవ ళించి ఉంది

కోడి పిల్లల్ని తిని భుక్తాయాసంగా తీర్చుకుంటూన్న పిల్లి-మత్తు మత్తుగా కళ్ళు విప్పి యజమానురాలిని చూసింది. "మ్యావ్-మ్యావ్" మంటూ అతి విన యంగా పలకరించింది.

"ఏమీ ఎరగని నంగనాచిలా 'మ్యావ్' మంటావ్ ఇంకా పైన. లే-అక్కడ్నించి. ఎల్లిపో నా ఇంట్లోనుంచి.మళ్ళీ మెట్టు క్రింద జేరావ్ నాకు అందవను కుంటున్నావ్. లే-నడువ్. బయటకి./ ఒకటిగాదు అరా గాదు.... పది కోడిపిల్లలు. ఎన్న ముద్దలు మింగినట్టు మింగి పారేసి 'మ్యావ్-' అంట-మ్యావ్" అంటూ రొప్పుతూ రోస్తూ. పొలికట్టె తీలికొని ఎడాపెడా




పిల్లిని బబర సాగింది.

కోపంతో ఊగిసలాడుతూ, ఆ మె కొట్టిన దెబ్బలు ఒకటీ రెండూ తప్ప తక్కిన వన్నీ గోతాలకు, గోడలకూ తగి లినాయి. యజమానురాలి ఆగ్రహం గ్రహించిన పిల్లి దెబ్బలు తప్పించుకొని చెంగు చెంగున ఎగిరి, తెరచిఉన్న ద్వారం లోనుండి బయటికెళ్ళి ఈత చెట్లలోకి వెళ్ళిపోయింది.

సాయంత్రం భోజనాల వేళప్పుడు పిల్లి ధైర్యం చేసుకొని లోనికొచ్చింది. కానీ పేరమ్మ గారు చాలా మెళుకువగా తలుపు దగ్గర అందు బాటులో ఉంచుకొని మళ్ళీ పొలికట్టె తిరగేసింది. పిల్లి తిరిగి చూడకుండా పారిపోయింది.

పిల్లి మళ్ళీ మళ్ళీ రావటానికి ప్రయ త్నించటం—ఆమె పొలిగట్టె అందుకోవటం మామూలై పోయింది. ఒక వారం రోజులు నిర్విరామంగా ప్రయత్నించి చీపురు దెబ్బలు తిన్న పిల్లి ఆ ఇంటిపై ఆశ వదులుకొంది. శాశ్వతంగా నిష్క్రమించింది.

*   *   *

ఆర్నెల్లు గడిచి పొయ్యాయి.

ఓ రోజు సాయంత్రం.... మునిమాపు చీకట్లు కమ్ముతున్నాయి పగలంతా దున్ని అలిసిపోయిన ఎద్లు దాణాలు తింటున్నాయి. పెద్దిరాజు రాత్రికి ఎడ్లకు కావాల్సిన జొన్న చొప్ప తుంటలు తుంటలుగా నరికి కొట్టం గోడవారగా మట్టసరిగాపెట్టి ఇంటి ముందు కొచ్చాడు. కోళ్ళు మెడలు సాగబెట్టి గంపలకేసి చూస్తూ తచ్చాడుతున్నాయి.

గడుసు ముసిలి కోడి ఒకటి పిల్ల కోళ్ళను తరిమి తరిమి పొడుస్తోంది. అన్నీ చెల్లా చెదురయి పోతున్నాయి. మళ్ళీ కలుస్తున్నాయి ఇరవై మువ్వయికోళ్ళు గంపల క్రిందకు వస్తూ పోతూన్నాయి. కానీ వాటన్నిటిలోనూ, మగ ఠీవితో హుందగా తిరిగే తెల్లపుంజు లేదు. అన్ని టికీ దూరంగా నిలబడి, అన్నీ గంపల క్రింద వెళ్ళే వరకూ నిలబడి చివరిగా గంప క్రిందకెళ్ళే కుక్కుట రాజు లేదు.

పెద్దిరాజు గుండెలు గుబగుబలాడాయి. ఆయన అటూ ఇటూ పరికించి చూశాడు.

పుంజు లేదు. లేదు. అటు గడ్డివాము వద్ద- ఇటు గోడ ప్రక్కన... ఎక్కడా లేదు. ఆయనకు కంగారు పుట్టింది.

"ఏదమ్మా! మన తెల్లపుంజు రాలేదు. ఏమి సంగతి? ఇయ్యాల నువ్వు ఇంటి పట్టునే ఉన్నావ్ కదా? పగలంతా అది ఎక్కడుంది?

"పగలేమిటి? ఇప్పుడే నేను పొయ్యి బూడిద ఎత్తి పెంట మీద పోసినప్పుడు ఆ పుంజూ, మన ఎర్రకోడీ పెద్ద తుమ్మ చెట్టు కాడున్నాయి....మరి ఎర్ర కోడి వచ్చిందా...." ఆమెఇంటిలోనుంచి సమా ధానం చెపుతూ ప్రశ్నించింది.

"ఇదిగో.... ఎర్రకోడి అది ఇక్కడే ఉంది.... మరి పుంజు ఎటుబోయె? మంది

కోళ్ళ ఎంటబడి ఏ రే ఇళ్ళకు గెన పోయిందా?....ఎవుడ్నీ నమ్మేట్టులేదు మన ఊళ్ళో మొన్న మటుకు మొన్న చల మయ్య బిడ్డది కోడి పుంజూ రెండూ పోయ్యాయంట....ఇగ్గో. కోడి గుడ్డు దీపంతోపాటు చేలాంతరుకూడా ముట్టించు ఒరేయ్ కొండయ్యా!....నువ్వు బ్యాటరీలైట్ తీసుకొని నడుప్" పెద్దిరాజు, పాలికాపు సహాయంతో అన్వేషణ ప్రారంభించాడు.

తన ఇంటికి ఇరుగు పొరుగున ఉన్న పది ఇళ్ళూ గాలించాడు. గంపలన్నీ ఎత్తి చూపించారు. నిరాశగా కాళ్ళీడ్చుకుంటూ వచ్చేసరికి అర్ధాంగి వాకిట్లో నిలబడి సలహా ఇచ్చింది

"నేను చెప్పానుగా, అదిఇందాకతుమ్మ చెట్టుకాడుందని నీదంతా అనుమానం యవ్వారం ఇటుబోయి ఆ తుమ్మల్లో సూడండి" పెద్దిరాజు తుమ్మల వైపు నడిచాడు బ్యాటరీ లైటు పట్టుకొని.

"ఏం పుంజు. ఏం కత. రెండున్నర కిలోలకు తక్కువ ఉండదు. పెడి అమ్ముకున్నా నలభై రూపాయలు. నలభై రూపాయలంటే మాటలా! పతిమంది ఆడకూలీలకైకివి....ఒక గెమాక్సిన్ చిన్నబస్తా...." అని స్వగతంగా అనుకుంటూ నడవ సాగాడు.

తుమ్మ చెట్ల ప్రక్కనున్న పొదలు పిచ్చి పువ్వుల తూటాకు చెట్లు పెరిగి పెరిగి ఒక్కొగాకలిమెలిసికొని పోయ్యాయి. సర్కారు పిచ్చితుమ్మ చెట్లుకూడా వికృతమైన ముళ్ళతో దారీతెన్నూ లేకుండా దట్టంగా ఉన్నాయి.

"ఇష్—ఇష్" అంటూ ముల్లుకర్రతో చెట్లపై కొడుతూ, ఏచెట్టుపైనైనాగానీ, ఏపొద చాటునైనాగాని పుంజు అలికిడి వినిపిస్తుందేమోనని నిరీక్షిస్తూ గాలించ సాగారు. తుప్పల్లోనుండి, ముళ్ళల్లోనుండి, బాటచేసికొంటూముందుకుపోతూంటే బాగా మదుగ్గా ఉన్న మోదుగు చెట్టు కనిపించింది.

మోదుగు ఆకుల కదుల్తూన్న అలికిడి.

టార్చిలైటు ఆర్పి రెండు నిముషాలు నిశ్శబ్దం పాటించి చెవులు రిక్కించారు. ఆ ఆకుల గుబుర్లలోనుండి ఎముక కొరుకుతూన్న శబ్దం. 'కర కర' మంటున్న సవ్వడి. 'ఇష్-ఇష్' అంటూ ఆకులు కదిలించారు.

'కరకర' మన్న శబ్దం ఆగిపోయింది.

ఒక్క నిముషం స్తబ్ధత. ఆ తరువాత గుర్రు గుర్రు మంటున్న పిల్లి మూల్గులు వినవచ్చాయి. ఎరను తింటూన్నప్పుడు జరిగిన అవాంతరానికి ప్రతి చర్యగా పిల్లి ప్రదర్శించే కోపం....సుదీర్ఘమైన గుర్రు గుర్రు.

నేల పైకి వంగి టార్చి ఫోకస్ చేశారు ఆకుల్లోకి.

రెండు కళ్ళు పచ్చగా ఉద్విగ్నంగా, రేడియంలా మెరుస్తున్నాయి. ఆ కళ్ళ క్రింద తెల్లటి ఈకలు—వెల్లికిలా పడి ఉన్న కోడిపుంజు కాళ్ళు వంకరగా ముడుచుకుపోయివికృతంగాఉన్నాయి. తింటూన్న ఎరను కాళ్ళ క్రింద అదిమిపట్టి తీక్షణంగా చూస్తోంది పిల్లి.

"నీయవ్వ పిలి ఇదిగోరా!....దీని తల్లి పిగతరగ, ఎయ్యి, నాలుగెయ్యి. సంపు బంగారం లాంటి కోడి పుంజును పొట్టన పెట్టు కుంది సూత్తావేంరా ఎయ్యి—" అంటూ ఆవేశంతో పాలికాపును హెచ్చరించాడు

దెబ్బ కొట్టటానికి వాలుదొరకటంలేదు, అన్నీ ముళ్ళు, కొమ్మలు. దానికి దెబ్బ తగిలే వీలు లేదు.

అందు వలన ముల్లుగర్ర పిల్లికి ఎదురుగ్గా బలంగా పొడిశాడు. పిల్లి అటూ ఇటూ పరుగెత్తే వీలు లేక వాళ్ళ కాళ్ళ మధ్యగా దూసుకొని పరుగెత్తింది వాళ్ళకు ఒళ్ళు జలదరించింది. వెంట్రుకలు నిక్కబొడిచాయి.

"ఒరేయ్ కొండయ్యా...దీనెమ్మా...ఇది మామూలు మనఇళ్ళలోతిరిగే పిల్లిగాదురా. ఇదేదో జంగురు బిల్లి లాగుంది. దానిపొట్ట సూడు. కొవ్వుబట్టి ఎంత మందంగా వేలాడుతోందో....ఎంత ఎత్తు, ఎంతబలం! ....దీని సంగతి రేపు సూసుకుందాం ఈ రాత్రిపూట ఏం చేత్తావ్...." అంటూ పరుగెత్తుతున్న పిల్లివైపు ఫోకస్‌చేసిన టార్చి లైట్ ఆర్పివేశాడు.

నేలపై వంగబడి ముల్లుగర్రతో మెల్ల మెల్లగా పుంజును బయటకి లాగారు. చిందర వందరగా ఉన్నాయివాని అంగాలు. రెక్కలు, కాళ్ళూ, తలకాయ ప్ప పుంజు ఆకారమే లేదు. మాంసంలేని పెద్ద పెద్ద ఈకలే పుంజు అవశేషాలుగా మిగిలాయి.


రూపంలేని ఆ కుక్కుట రాజునుచూసి పెద్దిరాజు గుండెలు తరుక్కుపోయ్యాయి.

* * *

రెండవ రోజు ఉదయం.

వేకువ జామున, తూర్పున చుక్కబొడ వంగనే పెద్దిరాజు లేచాడు. ప్రతిరోజులా ఎడ్లకు మేత వెయ్యలేదు వసారాలో తగి



లించిన తన అర్ధ చేతుల అంగీ తగిలించు కున్నాడు. కుడి చేతిలో వంక కర్రబట్టు కొని, నీళ్ళ చెంబు తీసికొని బయటకి పొయ్యాడు. ఆ పని ముగించుకొని ఖాళీ చెంబుతో ఇంటికి రాలేదు. పెద్దపెద్ద అంగ లతో ఎరుకల గూడెంకేసి నడిచాడు. ఎరుకల గూడెం ఇంకా నిద్ర లేవలేదు.

అస్తమిస్తున్న చంద్రుని గుడ్డి వెన్నెల్లో గుడిశెలు మరింత గుడ్డిగా ఉన్నాయి. ఒక గుడిశె ముందు ఆగి "ఒరేయ్ ఎల్లయ్యా! ఓరి ఎల్లయ్యా.... ఎల్లిగా.... ఇంకా లేవ లేదురా.... సుక్క బొడిసి ఏజామాయె ఏం సంగతి లే-లే...." అంటూ గట్టిగా పిలి చాడు.

"ఎవల్లూ.... ఎవల్లయ్యా...." గుడి శెలోనుండి కేక.

"నేనే. పెద్దిరాజును లెగు...."

"దొరా! ఏందీ పొద్దుగాల్నే మాఇంటి కొచ్చినావ్. నన్ను రమ్మని కొండయ్యని తోలిస్తే నేనే వచ్చే వాణ్ణి.... ఈతనువ్వల పైసలు రెండు దినాలు ఆగాలి .. ఇంకా తట్టల పైసలు అందలేదు. ఆ గుత్తేదారుకు ఇంకా పైసలు రాలేదంటా...." బయట కొచ్చి ఎల్లయ్య అన్నాడు.

"ఈత బరిగలకు కాదురా నేనొచ్చింది. నీ మీద పైసలెక్కడికి పోతాయిగానీ.... ఇగ్గో మన ఈత సెట్లలో దీని యవ్వ ... జంగుపిల్లి సేరిందిరా. అది ఎప్పుడు సేరిందో ఏందోకానీ, కోళ్ళన్నిటినీ వరస బెట్టి తింటందిరా....రాత్రిపొద్దుగూకిందో లేదో. మన పుంజు ఇంతెత్తుది. దాన్ని సొటనబెట్టుకుంది ఇప్పటికిపదోపన్నెండో అయినయి....అర్నీయవ్వ. ., ఇన్నాళ్ళూ ఏ లంజకొడుకో దొంగ తనంగా వాటిని బడతన్నాడను కున్నానుగానీ పిల్లే- అనుకో లేదురా....రాత్రి అసలు రాల్చం బయట బడిపోయిందనుకో. రాత్రంతా నిద్ర బట్ట లేదనుకో. ఎప్పుడు తెల్లవారుద్దా- ఎప్పుడు ఎల్లిగాణ్ణి పిలుసుకొద్దామాని సుక్కలు సూత్తానే పడుకున్నాననుకో.. .ఇకలే ఆవల బరిశె చేత్తో బట్టుకొని నడువ్. పోదాం..."

"పోదాం గానీ మరి నా ఒక్కడితో అయ్యే పని కాదిది. ఇంటిలో పొచ్చిన పిల్లి నయితే నేనొక్కడ్నే కొట్టగలను. కానీ ఇది జంగట్లో పిల్లి ఆ తుమ్మలు ఈత సెట్లూ అన్ని మనింపెనకాల అయిదా రెకరాలుంటది. అది ఏనంగబడితే ఆనంగ ఉరికి పారిపోవచ్చు నలుగురు మనుష లున్నాకావాలి రెండుచోట్ల వలలు పన్ని అటు వాగు ముఖానగానీ ఇటు పెంటకుప్ప కెల్లిగానీ తరుముకురావాలి, అప్పుడుగానీ అది దొరకదు...." అన్నాడు.

"సరేలే ఎల్లయ్యా.... నలుగుర్నీ పిలుసుకురా...."

"పిలుసుకురా! అంటే సరిపోయిందా? వాళ్ళు పొద్దున్నే లేచి ఈత బరిగె కోసుకో టానికో, తట్టలమ్ముకోటానికో, పందులు మేపుకోటానికో పోవాలి గదా! మరి వాళ్ళు వత్తారో రారో.."

"రా కేడికి పోతారు.... నేను పిలుస్తు న్నానని చెప్పు...."

"ఇగో దొరా! ఇనవయ్యా.. నీ కాడ దావరికమేంది గానీ వాళ్ళ గుట్టు నీకూ. నాకూ ఎరిక లేందేంది.... వాళ్ళెటు తిరిగి పని సెడి రావాలి. ఒక్కపూట పనంటే అయిదు రూపాయల సంపాదన. అంటే రెండు కిలోల బియ్యం.... మరి అందుకని నువ్వు అంత మందం వాల్లకేదయినా సెప్పాలి...."

"దూత్తిరీ.... నీ యవ్వ. పిల్లిని సంపి నాక కాల్చుకు తినేది మీరా, నేన్రా? పిల్లిని సంపి నాకేదో మల్లె గట్టినట్టు మాటాడు తున్నావ్...."

అయితే మరి మీరే సంపుకోండి పిల్లిని."

"మేమా.... .... .... ....?" తటపటా యించాడు.

"పిల్లిని సంపితే మాకు పాపం తగు లుద్ది." అమాయకంగా జవాబిచ్చాడు

"గట్టయితే ఆ పాపం మాకు మాత్రం తగల్దా.... మీరు పెద్దోళ్ళు గాబట్టి పాపాల మీకు తగల కుండ పాపపు పనులు మాతో సేయిస్తారు."

చన్నీటి కుండ తన నెత్తిన దిమ్మ రించినట్లు. ఉలిక్కి పడి లేచినట్లు అను భూతి కల్గింది. ఎల్లయ్య మాటలు పెద్ది రాజుకు బోధపడలేదు. డెబ్బయి సంవత్స రాల పెద్దిరాజుకు జీవితంలో వ్యవసాయం తప్ప ఇంకొకటి తెలియదు. జీవితాంతం దుక్కి దున్ని పంటలు పండించటలోనే తల నెరిసి పోయింది. కానీ లోకజ్ఞానం తెలుసు కోలేదు. ఎల్లయ్య చాలా తెలివి గల వాడనీ, తననేదో అవమానకరంగా మాట్లాడుతున్నాడని అనుమాన పడ్డాడు.

ఘర్షణ వలన బుద్ధి పనిచేయసాగింది.

కొద్ది క్షణాలు మౌనం వహించి గిరు క్కున వెనక్కి తిరిగాడు,

"పోతన్నరా....?" ఎల్లయ్య అడి గాడు

"అంత పాపపు పని నేనెందుకు సెయ్యాలి. నేనెందుకు సేయించాలి-" రెండడుగులు వేసి ఆగి అన్నాడు. దానికి సమాధానంగా ఎల్లయ్య దొంగ నవ్వు నవ్వుకున్నాడు. అందులో సిగ్గు- నటన గడుసు తనం అన్నీ ఉన్నాయి.

"నువ్వు మంచోడివే కానీ. మామూ లుగా పెద్దోళ్ళ సంగతి నవ్వుతాలకంటు న్నాను...."



"నవ్వుతాలేందీ?.... నాతో పరాచిక మేందిరా. ఇగ్గో నువ్వు ఎన్నో పిల్లులు సంపి తినుంటావ్ ఇప్పటి వరకూ.అవన్నీ నేను సంపమంటేనే సంపినావా? ఇప్పుడు నా అక్కెరకి పాపం-గీపమని మాట్లాడు తున్నావ్...." గట్టిగా మాట్లాడాడు.

"దొరా! ఒట్టి పిల్లికూరతో కడుపు నిండదు కదా!.... ఒక అర కుంచం బియ్యం కొలిపియ్యండి. మీ పేరు చెప్పు కొని ఈ పూట తింటాం. మీకు సంబర మనిపిత్తే ఒకబింకు కల్లుబొట్టు సెప్పండి-"

"ఒక అర కుంచం బియ్యం కొలిపిస్తే నాసిరంతా తగ్గిపోదులే.... రమ్మను వాళ్ళను—" అన్నాడు.

గూడెంల్లో అసలు సిసలైన వేటగాళ్ళు ఎల్లయ్య వెంట నడిచారు. వాళ్ళ చేతుల్లో బరిసెలు. వాళ్ళ భుజాలపై వలలు. ఆకాశంలో చుక్కలు మాయమై పొయ్యాయి చాలా వరకు వేకువన పొడిచిన చుక్క ఆకాశం పైకి ఎగబాకింది. మసక చీకటి. పెద్దిరాజు ఇంట్లోకి వెళ్ళి టార్చి లైటు తెచ్చాడు.

తుమ్మల బీడు చుట్టూ తిరిగి రెండు అనువైన ప్రదేశాలు ఎంపికచేసి అక్కడ రెండు వలలు అడ్డంకట్టి ఎల్లయ్య మాను కాశాడు. తతిమ్మా వాళ్ళు ఈత చెట్లను తుమ్మచెట్లను బరిశెలతో 'ఇష్-ఇష్' అంటూ కదిలించసాగారు. వాళ్ళ కేకలు. కదలికలు విని భయపడిన పిల్లి ఆ చెట్టు నుండి ఈ చెట్టుకు. ఈ చెట్టు నుండి ఆ చెట్టుకు పరుగెత్త సాగింది. అటు పరుగెత్తి.ఇటు పరుగెత్తి వెళ్ళి వెళ్ళి వలలో చిక్కుకొని గింజుకోసాగింది. ఎల్లయ్య బరిశెతో కుమ్మి పాడేశాడు.

పది మంది పోగయ్యారు. పిల్లి చూడటానికి టార్చి ఫోకస్ చేసి పిల్లిని అటు ఇటు పొర్లించి పరీక్షగా చూశారు.

"నీ యవ్వ ఇది మామూలు పిల్లే. జంగురుబిల్లి కాదు.. బావగారు ఇది మీపిల్లే మీ కోళ్ళన్నీటినీ తిని. తిని. తెగబలిసి. జంగురు బిల్లిలా ఒళ్ళు చేసింది. కోళ్ళ గంపని మనిషిలాగా ఎత్తిపట్టి కోళ్ళనందు కొని పొయ్యేది ఎంత బ ం. ఎంతతెలివి దీనిది. మీ ఇంట్లో ఫారం కోడిపిల్లలతో మొదలైంది దీని శరిత్ర. ఒక్కసారి నెత్తురు రుసి మరిగితేసరి....ఆ పిల్లిగానీ పులిగానీ. మనిషిగానీ ...చాలా పెమాదం—" సూత్రీకరణ చేశాడొక వేదాంతి.

"ఇది మా పిల్లేనా!" వాళ్ళను తోసు వచ్చాడు పెద్దిరాజు.

"ఏదోలే. పాపం పిల్లిని సంపటం పాపమని ఇడిసిపెడతా పోతాంటే నువ్వు ఇంత పనిసేత్తావ్. కోడిపిల్లలయిపోయే— అరకోళ్ళయిపోయే... చివరకు పుంజు.... బంగారంలాంటి పుంజు...పుంజును కూడా తింటావ్..." అంటూ పెద్దిరాజు చచ్చినపిల్లిని ముల్లుగర్రతో చిన్న పోటు పొడిచాడు నొప్పి తగలకుండ.

"చచ్చిన పిల్లిని ఏం సంపుతావ్‌రా ఇంటికి. ఇంటికి ఒక్క రూపాయి పెట్టి ఎలుకల మందు కొంటే ఇంత కత కాకపోవుగదా. కోళ్ళన్నిటినీ తిన్న తరువాత సంపక పోతే ఫారం పిల్లలప్పుడేసంపేత్తే ఎంతముద్దుగుండేదియవ్వారం.. "అల్లంత దూరాన నిలబడి చూస్తున్న పేరమ్మగారన్నది.

అజ్ఞానానికీ. అమాయకత్వానికీ ప్రతీకలైన ఆ తుమ్మ చెట్ల నల్లని నీడల్లో చీకటిలో కలిసిపోయిన వాళ్ళందరూ "అవునవు"నని తలలూపారు. ఇంకా తెల్లవారలేదు.


GRAMS : "TRACTORS" PHONES : 74060 & 73498

# PADMAJA COMMERCIAL CORPORATION

## LABBIPET, VIJAYAWADA-10

AUTHORISED DEALERS FOR

Hindustan Contessa, Hindustan Ambassador Mark-4 Cars

Hindustan Diesel Trekkers, Porters

and

Hindustan Trucks

Accaire Air-conditioners & Accooler water coolers

for

Coastal District of Andhra pradesh

Allwyn Refrigerators, Bottle Coolers and

Car Air-conditioners

Enfield Motorcycle and Zundapp Mopeds

Escort Tractors

Branches :

| | | |
|---|---|---|
| GUNTUR | : | 20871 |
| ELURU | : | 476 |
| RAJAHMUNDRY | : | 4959 |
| KAKINADA | : | 3924 |